# స్వప్నవిహారి

అర్ధరాత్రి "అలా పారేసుకొంటారా" అని కలవరింత. తట్టిలేపాను. ఏమిటో కలవరిస్తున్నావు సాగరం ! అన్నాను. నేనా ? కలవరించానా ? లేదే అని లేచి కూర్చున్నాడు కళ్ళు నులుపుకొంటూ.

విన్నవాళ్ళకు తెలుస్తుంది కానీ కలవరించినవాళ్ళకెలా ? అన్నాను. పిల్లాడిలా నవ్వేశాడు. ఏమి కలవరించానో తెలియదు కానీ చిత్రమైన కల వచ్చింది సుమా' అంటూ కూర్చుని మొదలెట్టాడు.

"బంగాళాఖాతంలో ఎవడో పెద్దమూట విసిరేశాడు. పెద్దగా చప్పుడు. ఎవరు నువ్వు, ఏమిటలా విసిరేశావని అడిగాను. ఆ మూట నిండా ప్రాచీన సారస్వతం అన్నాడు. విసిరేయడమెందుకూ అన్నాను ఆశ్చర్యంగా. వేదాలట, ఉపనిషత్తులట, పురాణాలట, మహాకావ్యాలట, ప్రబంధాలట. నా నెత్తి. సమాజానికి అవి ఎందుకూ పనికిరావు అన్నాడు తీవ్రంగా నావేపు చూస్తూ. పుట్టిన ప్రతివాడికీ తల్లీ తండ్రీ ఉన్నట్లే అతి ప్రాచీన సమాజాలన్నిటికీ సారస్వతం వారసత్వంగా ఉంటుంది - మరి. ఆనాటి సమాజంలో వాళ్ల వాళ్ల ఆలోచనలూ, దర్శనాలూ అలా పారేసుకొంటారా ? అందులో విలువైనదేమైనా ఉంటే దాచుకోవద్దూ అన్నాను.

"పాతవాసనలు పూర్తిగా కడిగిపారేస్తేనే కానీ సరికొత్త సామాజిక వ్యవస్థను ప్రతిష్ఠించలేమన్నాడు మా గురువు."

అదిగో అలా ప్రారంభమైంది గతమంటే కసీ అసహనం. అదీ ఒక రకమైన మతపిచ్చే. కొత్త వ్యవస్థలో బలముంటే నిలుస్తుంది. లేకపోతే పోతుంది గతాన్ని చెరిపి సాక్ష్యాలు తుడిచెయ్యాలా ? ఈ అసహనాన్నే ప్రతివాడూ హైజాక్ చేసి, తను చూసిందే సత్యం, తను చెప్పిందే మతం అన్న ఉన్మాదానికి ఆయుధంగా వాడేసుకొంటున్నాడు. మీ గురువు ప్రయోగదశలో అర్థశతాబ్దం కిందట అన్నమాటలివి. ఇప్పుడు అతని రాజ్యంలో వచ్చిన మార్పులు చూస్తే గుండెబాదుకొంటాడు. ఏదో చచ్చి బతికిపోయాడు .... అన్నాను. వాడు నా వేపు కొరకొర చూస్తూ వెళ్ళిపోయాడు. అప్పుడే కలవరించినట్టున్నాను. నువ్వు లేపేశావు." అని పూర్తి చేశాడు అతని కల.

ఈ ముచ్చట జరిగి ఏడాది సుమారుగా అయిపోయింది. ఏదో వార్తాపత్రిక చదివిన ఉద్వేగంతో కలగని ఉంటాడు అని సరిపెట్టుకున్నాను. కానీ ఇటీవల రాత్రిళ్ళు కలవరించడం, కూర్చుని కలలు వివరించడం, కలల్లోని మనుషుల్ని వర్ణించడం చూస్తూవుంటే మానసికంగా ఆరోగ్యం దెబ్బతినలేదు కదా అన్న అనుమానం పట్టుకుంది నాకు. కడుపునిండా భోంచేసి కంటినిండా నిద్రపోవడమే ఒకనాడు సాగరానికి అలవాటు.

బాగా తెలిసిన సంబంధమే మాది. నా పేరు సరళ. నీకభ్యంతరం లేకపోతే నిన్ను ఇకనుంచి సరితా అని పిలుస్తాను. నాపేరు విద్యాసాగర్ కదా అన్నాడు. మా స్నేహం ప్రేమగా మారే తొలిరోజుల్లో మా బాబాయ్ ఒకరోజు ఎమ్.ఏ. చదువుతున్న రోజుల్లో అతని రూమ్‌కి వెళ్ళి అతని పుస్తకాల షెల్ఫ్‌లో ఉన్న రచయితల్ని చూసి ఎంత సంతోషించాడో చెప్పలేం. హెగెల్, మార్క్స్, టాల్‌స్టాయ్, థోరో, రమణమహర్షి రాధాకృష్ణన్, ఆల్డస్‌హక్స్‌లే ఒకరి పక్కనే ఒకరు కనుపించారట. మా పెళ్ళికి బాబాయ్ ప్రోత్సాహమిచ్చాడు.

ఇంతవరకూ హాయిగా సాగిన మా దాంపత్యంలో ఇప్పుడీ అవలక్షణమేమిటి? ఈ కలలు కేవలం అతని మనసులోని ఆలోచనల కారణంగానేనా లేక ఏవైనా అశాంతి సూచికలా అని తర్కించుకొంటున్నాను. ఈ మధ్య ఒక సాయంత్రం ఇద్దరం వెళ్ళి మైదానంలో కూర్చున్నాం. తదేకంగా దూరాన ఉన్న మర్రిచెట్టును చూస్తూ ఎంత హుందాగా పెరిగిందో చూశావా ? అన్నివేపులా విస్తరించింది. దృఢంగా ఊడల తన్ని - గడ్డాలూ, మీసాలు పెంచిన మహర్షిలా ఉంది అన్నాడు.

నువ్వు చదువుకునే రోజుల్లో పెన్సిల్ స్కెచెస్ వేసేవాడివి కదా ఒక బొమ్మ గియ్యరాదూ ? అన్నాను. ఒక్కక్షణం ఆలోచించి, గూళ్ళకు తిరిగి వచ్చిన పక్షులతో ఎంత కోలాహలం, ఎంత చైతన్యం ? అదంతా గీతల్లో పట్టుకోవడం మనవశమా ? అని నవ్వేశాడు. ఆ రాత్రి నిద్రలోంచి లేచి కూర్చున్నాడు. విచిత్రమైన కల సుమా అన్నాడు. వింటున్నాను.

"నేను డ్రాయింగ్ మాష్టర్నట. మనం చూసిన మర్రిచెట్టు కేంద్రబిందువుగా ఒక పెద్ద వృత్తం గీసి దాని పరిధిమీద చుట్టూతా శిష్యుల్ని కూర్చోపెట్టి చెట్టుబొమ్మ గియ్యమన్నాను. అందరూ చక్కని చిత్రాలు వేశారు. దేని అందం దానిదే. అయితే అన్నీ ఒకేలా లేవు. ప్రతి ఒక్కడూ తన చిత్రమే ఆ చెట్టును సమగ్రంగా ఆవిష్కరిస్తున్నట్లు వాదించుకొంటున్నాడు. నవ్వుకొన్నాను. కల చెదిరిపోయింది.

చూసిన చెట్టు చుట్టూ తిరిగిన ఆలోచనలే కలగా వచ్చాయని సరిపెట్టుకొన్నాను. కానీ ఈ మనిషి రాత్రి నిజంగా నిద్ర పోతున్నట్టా లేక నిద్రలోనే మేల్కొంటున్నట్టా? అదే ఆశ్చర్యం. నాకు కలలు రావు. ఎంతో అరుదుగా వచ్చినా అవి లీలగా గుర్తుంటాయే తప్ప ఇలా వివరించగలిగినట్టు సంభాషణలతో సహా జ్ఞాపకం ఉండవు. అందుకే సాగరం కలలు ఎటువేపుకి దారితీస్తాయో అన్న ఆందోళన చోటు చేసుకుంది. పోనీ సాగరం తెలుగు సీరియల్స్ చూస్తూ కూర్చునే అలవాటుందా అంటే వాటి జోలికే పోడు. ఏ పుస్తకమో నవలో పట్టుకు కూర్చుంటాడు. వార్తాపత్రికలు విధిగా చదువుతాడు. ఈ కలల వాన ఈ మధ్య తెరిపిచ్చిందనుకొన్నాను. ఒక రాత్రి కూర్చున్నాడు. చిత్రమైన కల అన్నాడు వివరిస్తూ.

"పాలమీగడ లాటి గడ్డం, మీసం, పక్షిగూడు లాటి జుట్టు, పొడుగాటి వ్యక్తి, కళ్ళలో కాంతి, సూదిముక్కు" వింటూనే నాకు వస్తున్న నవ్వును ఆపుకునే ప్రయత్నం చేశాను. కలలోని వ్యక్తిని వర్ణించడం కూడానా అనుకుని ఉత్సాహభంగం కలక్కుండా వింటున్నాను.

"లియనార్డోడవించీ అని గుర్తుపట్టి వినయంగా తలవంచి నమస్కరించాను. ఎవరు నాయనా అన్నట్టు చూశాడు. జంబూద్వీపం భరతవర్షం, భరతఖండం వేపు నుండి అని అనగానే ప్రసన్నంగా నవ్వాడు. మంచి ఆలోచనలు అన్ని వేపుల నుండీ రావాలని కోరేవారుట అక్కడి పెద్దలు. స్త్రీలేని సృష్టి, జీవితం అసమగ్రం అని నమ్మి ప్రతి దేవుడికీ ప్రక్కన ఒక దేవేరిని నిలిపి కొలిచే సంప్రదాయం నిలిపేరట. చెప్పగా

విన్నాను. మార్కోపోలోది మా ఊరే. శాస్త్రం మతం సత్యాన్ని వెదకడానికి బయలు దేరతాయి కానీ కొందరు మతాధికారులు ఏ దారి మంచిదనే వాదులాటలో గమ్యం మాట పూర్తిగా మర్చిపోతారు కదా. ఇక అధికార దాహం మొదలవుతుంది.

ఎందుకలా అంటున్నారు ? అన్నాను.

“నేనూ మైకేల్‌ఏంజిలో ఈ మతాధికారులతో పడి పడి ఉన్నాం. మేరీ మేగ్డలీన్ అస్తిత్వాన్ని గుర్తిస్తే జీసెస్ దివ్యత్వానికే అప్రతిష్ఠ అన్నదొక విచిత్రమైన భయం కొందరికి. ఒక అబ్బోట్ నన్ను లాస్ట్‌సప్పర్ వర్ణచిత్రం వెయ్యమన్నాడు. సరేలే అని నేను పది రోజులపాటు ప్రశాంతంగా కూర్చున్నానో లేదు నా వెంట తగిలి ఎప్పుడు ప్రారంభిస్తావు అలా కూర్చుంటే కాలం గడిచిపోవడం లేదూ ? అన్నాడు. వాడికి కళ అంటే ఎంత చులకన భావం ? చేత్తో కుంచె పట్టితే కళాసృష్టి జరిగిపోతుందనుకుంటాడు. మెదడుతో వెయ్యాలని ఎరగడు. ఒళ్ళుమండింది నాకు. నవ్వుకూడా వచ్చింది. నేను వేసిన చిత్రంలోని జూడాస్ ఇస్కారియట్‌కు అచ్చంగా ఆ అబ్బోట్ పోలికలే వచ్చేశాయి. జీసెస్ కుడిప్రక్కనే లేడీ మాగ్డలీన్‌ను భద్రంగా కూర్చోపెట్టేశాను. మా అమ్మ పెళ్ళిచేసుకోకుండా నన్ను కనిందట. నన్ను ఎంత చులకనగా చూసేవారో నీకు అర్థంకాదు.' డవించీ అలా మనసు విప్పి కల్లాకపటం లేకుండా మాట్లాడుతూ వుంటే ఆ మేధావినే చూస్తున్నాను. కల చెదిరిపోయింది. కానీ నిజంగా జరిగినట్టే అనిపించింది. ఎంత వింత” అన్నాడు సాగరం. డావించీని ఎలా వర్ణించావు ? అతన్ని చూశావా అడిగాను నవ్వుతూ. తనుకూడా నవ్వుతూ 'మన ఇంట్లోని ఎన్‌సైక్లోపీడియాలో అతని బొమ్మ చూస్తూ వుంటాను కదా!' అనేశాడు.

ఆనాటికి నాలుగు రోజుల క్రితం వరకూ విడవకుండా చదువుతూ వుంటే డవించీ కోడ్ అన్న నవల అతని చేతిలో చూశాను. ఇంకోమారు కలవచ్చిందంటే మాత్రం నాకు చనువున్న మా బాబాయితో మాట్లాడి ఎవరైనా సైకియాట్రిస్టుని ముందుగా సంప్రదించాలనీ, సాగర్‌కి నా భయాలు చెప్పకుండా ఒకేమారు తీసుకొని వెళ్ళాలనీ నిశ్చయించుకొన్నాను.

ఒక సాయింత్రం సుడిగాలిగా వచ్చింది చెప్పకుండా నా స్నేహితురాలు నిర్మల. నేనూ తనూ ఇంటర్‌మీడియట్ వరకూ కలిసే చదువుకున్నాం. ఇప్పుడు జర్నలిజం పూర్తిచేసి ఏదో పత్రికలో వ్యాసాలు రాస్తూ ఉంటుంది. తను మన పురాణాల్లోని సీత, సావిత్రి, దమయంతి, ద్రౌపది వంటి పాత్రలమీద ఒక థీసెస్ రాస్తున్నట్లు,

డాక్టరేట్ కోసం ప్రయత్నిస్తున్నట్టు చెప్పింది. వేడివేడిగా కాఫీ త్రాగి వెళ్ళిపోయింది. సాగరం తనగదిలోనే ఉన్నట్టు, మా మాటలువింటున్నట్టూ నేను గుర్తించలేదు. నిర్మల వెళ్ళిపోయాక అందరూ ఈ పాత్రల మీద ఏదో రాస్తూనే ఉన్నారు. అంతకన్నా కాసింత వెనక్కు వెళ్ళి ఒక విశిష్టమైన పాత్రను పట్టించుకోరెందుకూ? అన్నాడు. నాకంతగా అతనిమాట అర్థంకాలేదు. 'నికార్సయిన నిజాన్ని వెతుక్కుంటూ వెళ్ళడం ఒక పద్ధతి. ఒకటి సత్యమని నమ్మి దానికి బలమిచ్చే సాక్ష్యాలు సేకరించడం మరో పద్ధతి' అన్నాడు. ఏదో పని తొందరలో అతనితో వాదన పెంచలేదు.

అదే రాత్రి లేచి కూర్చున్నాడు. ఏదో కలవచ్చినట్టుంది అన్నాను నవ్వు ఆపుకొంటూ

"కారడవిలో యువకుడు. కలువ రేకుల్లాంటి కళ్ళు. వాటిలో ఏదో వెలుగు

ఈ అడవిలో మారుమనిషి సందడే లేకుండా ఎవరు నాయినా నువ్వు అన్నాను.

'ఒంటరిని కాదు స్వామి. ఇన్ని ఆవులు నా చుట్టూ మోరలెత్తి అంబా అని అరుస్తూ, నేదగ్గరగా వెళ్తే నాలుకలతో నాకుతూ నామీద అవ్యాజమైన ప్రేమ వొలికిస్తాయి. ఈ అడవే నా పాఠశాల. సమగ్ర సత్య సందర్శనానికి నా గురువు పంపిన ప్రయోగశాల.'

ఎంతటి కఠినాత్ముడు. నీ గురువు ? అన్నాను. నామాట పూర్తికాకుండానే అపరాధం స్వామీ. వారి హృదయం నవనీతం అంత మృదువు, ఆకాశమంత విశాలం. సాటి విద్యార్థుల్లాగ బ్రతుకు తెరువు చదువుతో తృప్తిపడి ఇంటికి పోక సమగ్ర సత్య దర్శనం నా ఏకైక లక్ష్యం అన్నాను. వారిని నేను వేధిస్తేనే ఇలా పంపారు.

ఈ అడవిలో జీవితానికి అలవాటు పడ్డాక కపటమెరుగని నా తల్లిలాంటి ప్రకృతిమాత ఒడిలో ఉన్న శిశువులా ఆనందిస్తున్నాను. ఈ ఆవులూ అడవిలోని మృగాలు, పక్షులు, ప్రాణులూ తరువులూ వాటి వాటి అరుపులతో, కూతలతో, రంగులతో నన్ను వాటితో మమేకం చేసేశాయి. ఇప్పుడు నన్ను నాకుతూ ఇక్కడ ఉన్న కోడె దూడ చూశారా? ఇది తల్లి కడుపులోంచి భూమ్మీద పడుతున్నప్పుడు అక్కడే ఉండి చూశాను. నీటి మబ్బులా బరువుగా చలనం లేకుండా నిలుచున్న దీని తల్లి కడుపు చీల్చుకొని లేగదూడగా భూమ్మీద పడ్డతర్వాత ఆ తల్లీ బిడ్డలలోని

చైతన్యం ఆశ్చర్యంతో చూశాను. సృష్టి ప్రారంభం ఇలాగే జరిగి ఉంటుంది. నేను పుట్టినప్పుడు కూడా నా తల్లికి ఇంతటి ప్రసవ వేదనా తర్వాత ఇంతటి ప్రమోదమూ కల్గించి ఉంటాను అనుకొన్నప్పుడు నాకు దూరంగా ఉన్న నా తల్లిని కృతజ్ఞతతో తలచుకొన్నాను. ఆమె నిజాయితీని, స్త్రీత్వాన్నీ, మాతృత్వాన్నీ గౌరవించగల గురువు కృప లేందే నేనిక్కడకు వచ్చి ఉండేవాడినా ?'

ఈ ఆవుల్ని క్రూరమృగాల్ని ఎలా కాపాడుకోగలిగావు అని ఆశ్చర్యంగా అడిగాను. 'నాకు తోచినది నేను చేశాను. ఆవులు మధ్యాహ్నం వెలుగులో మేత మేసుకునే వేళ నేను ఊరకే ఉండలేక చురకత్తుల్లాటి ఎండిన ముళ్ళకంపలను ఏరి తెచ్చి పారలు పారలుగా ప్రాకారాల్లాగా పేర్చి ఒక రక్షక వలయం ఏర్పాటు చేశాను. రాత్రిపూట ఆవుల్ని వాటి మధ్యకు తోలి మంద కుక్కల సహాయంతో కాపాడుకొన్నాను. మంచె మీదనే పడుకొనేవాడిని. ఇది కేవలం నా ప్రయత్నమే కానీ ప్రకృతి విధించిన నియమాలు కొన్ని క్రూరమృగాలనుకునే జంతువులూ, పాములూ కూడా పాటిస్తున్నాయని అర్థం చేసుకుని ఆశ్చర్యపోయాను.

ఆకలి వేధించినప్పుడే పులి వేటాడుతుంది. దాని ఆకలి దానిది. కడుపునిండిన వేళ ఎదురుగా సంచరించే పశువుల్ని కూడా సాటి ప్రాణిగానే చూస్తుంది. పాములు వాటికి నిర్దేశించిన పులుగునీ గుడ్లనీ వెతుక్కుంటాయే కానీ చీకటిపడే వరకూ గట్టంటా, పుట్టంటా గడ్డి మేసుకునే పశువుల జోలికి పోవు. ఎంతటి నియంత్రణ ఇది. స్వజాతి హింస కానరాదు. ఇది మానవుడు సాధించలేనిది. అడవి దాని అస్తిత్వాన్ని నిరంతరం నిలుపుకోడానికీ పచ్చదనాన్ని రక్షించుకోవడానికీ క్రూరమృగాల్ని రక్షక భటులుగా ఆశ్రయం కల్పించి వాటికి ఆహారం కోసం పశువుల్ని తన పచ్చదనంతో ఆకర్షిస్తుందా అన్న ఆశ్చర్యం కల్గుతుంది. ఇంతెందుకూ చెట్టూ, అడవీ భూమి, సౌరకుటుంబం పాలపుంతలు వేటికవే ప్రత్యేక వ్యవస్థలుగా కనిపిస్తూ ఒక విశ్వాకృతిలోని అంగాలుగా ఒదిగిపోతున్నట్టూ ఆ విశ్వాకృతిలో నేనూ ఒక అణువైపోయినట్టూ భావన రాగానే ఏదో సత్యసందర్శనమైనట్టు అనిపిస్తుంది. ఆ ఆనందంలో మునిగిపోయేక నా ఉనికే గుర్తుండదు. ఏదో ప్రశాంతి, అదే నే కనుక్కొన్న సత్యం." అంటూ కళ్ళు రెండూ మూసుకున్నాడు.

నా కల చెదిరిపోయింది. నేనీ కథ చిన్నతనంలో విన్నాను. కానీ ఇంతగా నాకు వివరణ దొరకలేదు సుమా ! అంత వెనుకటి కాలంలో గౌతముడు వంటి

గురువూ, జబలవంటి శక్తివంతమైన స్త్రీ పాత్రా సృష్టించిన సారస్వతం ఉంటే మనకెందుకో ఇంత న్యూనతాభావం. సరే పద రెండు గ్లాసులు బోర్నవిటా కలుపుకు తాగుదాం. నీ నిద్ర నా కలవల్ల పాడై పోయింది కదూ.

సత్యాన్ని శ్రద్ధగా వెదకడం మానేస్తున్నాం. ఏదో సూత్రానికో, నమ్మకానికో అంకితమై పోయి దానికి బలమిచ్చే సాక్ష్యాధారాలు ఏరుకొంటున్నాం అన్నాడు సాగరం.

తరచూ ఇంతింత వివరంగా కలలు రావడమేమిటి? ఇది ఆరోగ్యమా, అవలక్షణమా? అన్న సందేహం నన్ను పీకుతూనే ఉంది. మా బాబాయ్‌ని సంప్రదించాక అతనికి తెలిసిన సైకియాట్రిస్ట్‌ని కలిశాం. నా ఆందోళన, సాగరం కనే కలలూ ఎంత వివరంగా చెప్పాలో అంత వివరంగానూ, ఏ దాపరికం లేకుండానూ చెప్పాను. మేం చెప్పినది శాంతంగానే విన్నాడా శాస్త్రవేత్త. కొన్ని శాస్త్రగ్రంథాలు తెరచి - అక్కడక్కడ ముఖ్యమైన వాక్యాలు మా చేత చదివించాడు కూడా. ఆ తర్వాత అతని అభిప్రాయాన్ని ఇలా వివరించాడు.

"కలలు ఎందుకు వస్తాయో వాటి ప్రయోజనమేమిటో ఈనాటికీ స్పష్టంగా పరిశోధన పూర్తికాలేదు. శారీరకంగానూ మానసికంగానూ అవసరాలుండబట్టే అవి నిద్రావస్థలోకి వచ్చి పలకరిస్తాయి అని ఆధునిక ప్రయోగాలు చెప్తున్నాయి.

దినమంతా ఆకులూ అలములూ మేసిన పశువులు విరామంలో భద్రంగా ఉన్నప్పుడు ఆ మేతను నెమరవేస్తూ రుచిని ఆస్వాదిస్తాయి. అలాగే మీవారు తాను చదువుతున్న ప్రపంచాన్నీ తన ఆలోచనల్నీ రాత్రి తీరికగా కలల్లో సమన్వయించు కొంటున్నారు. వారి ప్రవర్తనలోనూ దిన చర్యలోనూ ఇతరాత్రా ఏ వైపరీత్యాలూ లేకుంటే అది ఆరోగ్యంగానే స్వీకరించాలి కదా!" అన్నాడు నా వేపు తిరిగి.

తృప్తిగా నేను ఇంటికి వచ్చాను. సాగరం ఎప్పటిలాగే ప్రశాంతంగా తన గదిలో పుస్తకం చదువుకొంటున్నాడు.

✣ ✣ ✣

రచన - ఫిబ్రవరి ౨౦౦౭